ప్రజాశక్తి

ఆదివారం 23 జులై 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

పులిచింతలలో భారీగా తగ్గిన నీటినిల్వ

- మున్నేరు, బుడమేరుతో ప్రకాశం బ్యారేజికి వరద
- ఎట్టకేలకు పట్టిసీమ నుంచి డెల్టాకు నీరు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణా పరివాహక ప్రాంతంలో పులిచింతల, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి మట్టం గణనీయంగా తగ్గింది. గతేడాది జులై 22 నాటికి ఉన్న పరిస్థితికి, ప్రస్తుత పరిస్థితికి చాలా వ్యత్యాసం కన్పిస్తోంది.

దీంతో ఈ ఏడాది నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో వరి పంటకు నీరు ఇచ్చే పరిస్థితి లేదని అధికారులు అంటున్నారు. మెట్ట పంటలు మాత్రమే సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెల్టాలో వర్షాలు కొంత మేరకు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రకాశం బ్యారేజికి నీటి ప్రవాహం కూడా కొనసాగుతుంది. ప్రధానంగా ప్రకాశం బ్యారేజి ఎగువన, పులిచింతల దిగువన కొన్ని ఏరులు పొంగి ప్రకాశం బ్యారేజికి వస్తున్నాయి. మున్నేరు, బుడమేరు ద్వారా ప్రకాశం బ్యారేజికి శుక్రవారం రాత్రి 17 వేల క్యూసెక్కుల నీరు వచ్చింది. ఇందులో దాదాపు 8500 క్యూసెక్కుల నీరు కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు విడుదల చేస్తున్నారు. మరో 9500 క్యూసెక్కుల నీరుసముద్రంలోకి విడుదల చేస్తున్నారు. డెల్టాకు ఇప్పటివరకు ఉన్న నీటి ఎద్దడి తాత్కాలికంగా తొలగిపోయింది. ప్రధానంగా 13.65 లక్షల ఎకరాల సాగయ్యే కష్ణా డెల్టాలో ఈఏడాది సరైన వర్షాలులేక ఎగువనుంచి జలప్రవాహం రాక రైతులు ఆందోళనచెందారు. ఈ నేపథ్యంలో పట్టిసీమ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ఈలోగా మున్నేరు వరద ప్రవాహం వచ్చింది. పట్టిసీమ నీరు సోమవారం నుంచి ప్రకాశం బ్యారేజికి చేరుకుంటుందని అధికారులు చెబుతున్నారు. గత నాలుగేళ్లుగా పట్టిసీమ నీరు వినియోగించుకునే అవకాశం రాలేదు.

ఈఏడాది శ్రీశైలం, సాగర్, పులిచింతలకు కృష్ణా జలాలు రాకపోవడంతో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు తెచ్చుకోక తప్పని పరిస్థితిఏర్పడింది. ఈ ఏడాది కష్ణ ఎగువ ప్రాంతంలో ప్రధానంగా కర్ణాటకలో వర్షాలు లేకపోవడం ఆల్మట్టి జలాశయంకు నీరు రాకపోవడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతంలోవరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించిన పులిచింతల జలాశయంలో గరిష్ట నిల్వ 45.77 టీఎంసీలు కాగా శనివారం 17.17 టి ఎం సి.ల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత ఏడాది

2 లో

జిజిహెచ్‌లో ప్రక్షాళన జరిగేనా?

8లో

వీక్షణం

గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

మణిపూర్ హింసకు కేంద్రందే బాధ్యత

గుంటూరు, పల్నాడు జిల్లాలో ఐద్వా, దళిత, ప్రజాసంఘాల నిరసనలో నాయకులు

దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, సామూహిక అత్యాచారాలకు నిరసనగా గుంటూరు, పల్నాడు జిల్లాలో ఐద్వా, దళిత, ప్రజాసంఘాల ఆద్వర్యంలో నిరసన తెలిపారు. దోషులను కఠనంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గుంటూరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక శంకర్ విలాస్‌సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాడ్లాడుతూ గత మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లరు జరుగుతుంటే బయటి ప్రపంచానికి తెలియకుండా ఇంటర్నెట్ ను సేవలు బంద్‌చేశారన్నారు. సోషల్ మీడియా ద్వారా అక్కడి విషయాలు బయటకు వచ్చిన నేపథ్యంలో ముగ్గురు మహిళలను అత్యాచారం చేసి, నగ్నంగా అల్లరి మూకలు రోడ్డుపై నడిపించడం హేయమైన చర్య అని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.యుద్ధప్రాతిపదికన మణిపూర్‌లో శాంతి భద్రతలు నెలకొల్పటానికి చర్యలు తీసుకోవాలన్నారు. విరసం నాయకురాలు రుక్మిణి మాట్లాడుతూ అక్కడి వనరులను దోచుకోవటానికి కుకీలు, మైతీ తెగల మధ్య చిచ్చు రాజేసిన బిజెపి ప్రభుత్వం

2 లో

వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు మానవహారంతో నిరసన , పాల్గొన్న ఐద్వారాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

సమావేశంలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య, వేదికపైన చలమయ్య, బాలకృష్ణ తదితరులు

నాలుగు రెట్లు నష్టపరిహారమివ్వాలి

భూములు కోల్పోయిన రైతుల సమావేశంలో వి కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తనపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరకు నాలుగు రెట్లు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సత్తెనపల్లి పుతుంబాక భవన్‌లో పీలా సాంబశివరా అధ్యక్షతన బాధిత రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత రైతులు మాట్లాడుతూ సత్తెనపల్లి మండలం గుంటూరు రోడ్డులోని కంటెపూడి నుండి గార్లపాడు రోడ్డు లోని సత్తెనపల్లి మంచినీళ్ళ చెరువు ప్రక్కగా మాచర్ల రోడ్డులోని దూళిపాళ్ల వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ నిర్మాణంలో 75 ఎకరాల భూమికి సంబంధించి 200 మంది రైతులం భూములను కోల్పోతున్నామని అన్నారు. ఈ భూములు సత్తెనపల్లి పట్టణానికి పరిసర ప్రాంతం కావడంతో ఇప్పటికే ఇళ్ల స్థలాల ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ అయ్యా యన్నారు. కానీ ఈ భూములు ఇళ్ల స్థలాలుగా

2 లో

నకిలీ విత్తనాలు స్వాధీనం

ఇద్దరిపై కేసు నమోదు

మిర్చినారు పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు గ్రామ సమీపంలోని ఓ నర్సరీలో నకిలీ మిరప నారు సాగు భాగోతం బట్టబయలైంది. శనివారం కాల్ సెంటర్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ మురళి అధికారులతో కలిసి నర్సరీలో మిరపనారును పరి శీలించారు. బిఎఎస్‌ఎఫ్ నన్‌హెన్స్ కంపెనీ వారి ఆర్మూర్ మిరపరకం నకిలీ విత్తనాల ప్యాకెట్లు మూడింటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నర్సరీ యజమాని టి ముక్కంటిని నకిలీ విత్తనాల సాగుపై ప్రశ్నించగా నరసరావుపేటకు చెందిన కొండలు అనే వ్యక్తి తనకు 72 ప్యాకెట్లు ఇచ్చి పెంచమని చెప్పినట్లు తెలిపాడు. అనంతరం ఈపూరు రైతు భరోసా కేంద్రంలో విచారణ చేపట్టారు. అనధికారికంగా నర్సరీ నిర్వహిస్తూ నకిలీ మిరప విత్తనాలు సాగు చేస్తున్న తొర్లకొండ ముక్కంటిపై, నరసరావుపేటకు చెందిన కొండలుపై ఫిర్యాదు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ రామారావు తెలిపారు. విచారణ లో ఏడిఏ రవి బాబు, నరసరావుపేట ఏవో నరేంద్రబాబు, వీఆర్వో తదితరులున్నారు.

కేంద్రం నిధులివ్వకుంటే మేమే కట్టిస్తాం

సిఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే కట్టించి అమరావతిలో పేదల సొంతింటికల నెరవేరుస్తామని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 24న సిఎం జగన్ పర్యటన సందర్భంగా మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం ఆయన కృష్ణాయపాలెం, వెంకటపాలెం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటపాలెంలో మీడియాతో మాట్లాడారు. అన్ని సౌకర్యాలతో పేదలకు ఒక ప్రైవేటు లే అవుట్ లా ఇళ్ళు నిర్మిస్తున్నామని సజ్జల చెప్పారు. అమరావతిలో పేదల ఇళ్ళ నిర్మాణంతో 10 వేల కోట్ల సంపద ఏర్పడుతుందన్నారు. పేదలకు ఇళ్ళు నిర్మించి ఇవ్వడం నేరమా అన్నట్టు టిడిపి గత నాలుగు ఏళ్లుగా అడ్డుపడుతుందన్నారు. అమరావతిలో సేకరించిన భూమిలో ఐదుశాతం పేదలకు ఇవ్వాలని సిఆర్‌డిఎ చట్టంలోనే

2 లో

శారదాకాలనీలో నిరసన

మణిపూర్ హింసకు కేంద్రందే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

మణిపూర్ అల్లర్లకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మహిళలను దారుణంగా హింసించి అత్యాచారాలను చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి షకీలా మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలను ప్రపంచ దేశాలు చూస్తున్నాయని, మనదేశ ప్రధాని మాత్రం మౌనం వహించటం అత్యంత దారుణం అని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.పద్మ, నగర కార్యదర్శి ఏ. కళ్యాణి, కె.శ్రీదేవి, ఎం.కష్ణకుమారి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ, కె.నళినీకాంత్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళాధర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ చిష్టీ, జిల్లా అధ్యక్షులు షేక్.భాషా, పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామకృష్ణ, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, సిఐటియు నాయకులు షేక్ ఖాసిం వలి పాల్గొన్నారు.

శారదా కాలనీలో అంగన్‌వాడీ యూనియన్ నిరసన

స్థానిక శారదా కాలనీలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో మణిపూర్‌లో హింసకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. యూనియన్ నగర నాయకులు టి.రాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస రావు, ఐద్వా నగర కార్యదర్శి కళ్యాణి, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఖాసింవలి ప్రసంగి ంచారు.

నాలుగు రెట్లు నష్టపరిహారమివ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

కన్వర్షన్ కాకపోవడంతో పంట భూములుగానే గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తామంటుందని సమావేశంలో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతు బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులు మినహా మిగతా రైతుల భూములకు మంచి ధర పలుకుతుందని, కావున భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం 2013 భూ సేకరణ చట ప్రకారం నాలుగు రెట్లు ధర నిర్ణయించి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌నకు బాధిత రైతుల అసమ్మతి పిటిషన్లు ఇవ్వాలని సమావేశం నిర్ణయించిదని తెలిపారు. రైతు సంఘం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులందరూ ఐక్యమై తగిన న్యాయం జరిగే వరకూ దశలవారీగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీనియర్ న్యాయవాది దేవినేని దస్తగిరి మాట్లాడుతూ బాధిత రైతులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ న్యాయవాది చలవాది చిన సత్యనారాయణ మాట్లాడుతూ బైపాస్ రోడ్డు పక్కన భూములు రూ.కోట్ల ధర పలుకుతుంటే నామమాత్రంగా పరిహారం అందజేస్తే సహించేది లేదన్నారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా ధరను నిర్ణయించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు చుక్కపల్లి శ్రీనివాసరావు, మేకల కామేశ్వరరావు, యల్లినేడి వెంకటేశ్వ రరావు, దుగ్గినేని నరసింహారావు, ప్రజాసంఘాల నాయకులు గుంటుపల్లి బాలకష్ణ, పెండ్యాల మహేష్, అవ్వారు ప్రసాద్ రావు పాల్గొన్నారు.

పులిచింతలలో భారీగా తగ్గిన నీటినిల్వ

(మొదటిపేజీ తరువాయి)

జులై 22న పులిచింతలలో 37.68 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది 20 టిఎంసీల నీరు తక్కువగాఉంది. నాగార్జునసాగర్ లో గరిష్ట నీటి నీటి నిల్వ 312 టీఎంసీ లు కాగా ప్రస్తుతం 144.04 టీఎంసీ లు మాత్రమే నిల్వ ఉంది.గత ఏడాది ఇదేరోజుకు 179.69 టిఎంసిల నీరు నిల్వ ఉంది. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.80 టిఎంసీలు కాగా ప్రస్తుతం 33.62 టిఎంసిల నీరునిల్వ ఉంది. గతేడాది ఇదేరోజుకు 196.21 టిఎంసిలనీరు నిల్వ ఉండగా ఈఏడాది శ్రీశైలంలో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. పశ్చిమ డెల్టాలో 4.36లక్షల ఎకరాల్లో వరిసాగు జరగాల్సి ఉండగా ఇంకా వరి నాట్లు ప్రారంభం కాలేదు. వెదపద్ధతిలో 25 వేల ఎకరాల్లోనేసాగు చేశారు. ప్రస్తుతానికి ప్రకాశం బ్యారేజి ద్వారా నీటి సరఫరాకు ఇబ్బంది లేకపోయినా నాగార్జునసాగర్‌లో మాత్రం నీటి ఎద్దడి పొంచిఉంది. ప్రస్తుతం తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి : సిఐటియు

ముగిసిన రెండురోజుల రిలే దీక్షలు

ప్రజాశక్తి-మంగళగిరి

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం రెండవ రోజు కొనసాగాయి. దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య ప్రారంభించి, మాట్లాడారు. ఎంటిఎంసి పరిధిలోని 21 విలీన గ్రామాల కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో కే గోపి, కే దుర్గ, ఎం మేరీ, కుమారి, ఎన్ కృష్ణ, జి నాంచారమ్మ, వై వెంకట్ రమణ పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పి పూర్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎస్ చంగయ్య

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఖజానా శాఖ డైరెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు ఎన్.మోహనరావు శనివారం గుంటూరు వచ్చిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.ఈ సందర్భంగా డైరెక్టర్‌కు పెన్షనర్ల సమస్యలను నాయకులు విన్నవించారు. ఈకేవైసి చేయని పెన్షనర్లను ఒత్తిడి చేయవద్దని, పెన్షనర్లు అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వారికి, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకు కాని వారికి, వివిధ కారణాలతో ఇంటి నుండి కదల్లేని వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు. అలాగే పెన్షనర్లకు ఆదాయ పన్నుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించటానికి ఈనెల తగినంత సమయం లేనందున వచ్చేనెల లో సమర్పించిన వారి పత్రాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జూన్‌లో ఇచ్చిన జీ.ఓ. ప్రకారం ఈనెల పెన్షన్‌లో కొత్త డి.ఏ. కలిపి పెన్షన్ జమ చేయాలని, ప్రతి నెల ఒకటవ తేదీన పెన్షన్ విడుదల చేయాలన్నారు. డైరెక్టర్ మోహనరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను మొదటి ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరిస్తానని తెలియచేశారు. సి.ఎఫ్.ఎమ్.ఎస్.లోని లోపాలను సవరించి ప్రతి నెల ఒకటవ తేదీన పెన్షన్ విడుదల చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.నాగరాజు, జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వర్లు, కోశాధికారి కే.లూర్ధ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుబ్బరావు, నాగేశ్వరరావు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ను కలిసిన సంఘ నాయకులు

పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు :రాజధాని పారిశుధ్య కార్మికుల రెండు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని సిపిఎం రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి ఒక ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. రాజధాని గ్రామాల పారిశుధ్య కార్మికుల ఆకలి కేకలు పాలకులకు పట్టవా.. అని ప్రభుత్వాన్ని, అధికారులను ప్రశ్నించారు. జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిఆర్‌డిఏ అధికారులు మూడో నెల పూర్తి కావస్తున్నా కార్మికులకు జీతాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. చిన్న చిన్న కారణాలతో పనిష్మెంట్ ల పేరుతో పారిశుధ్య కార్మికులను దూరంగా ఉన్న గ్రామాలకు పంపించి కోఆర్డినేటర్ నరసింహారావు వేధింపులకు దిగుతున్నారని, తుళ్లూరు సి ఆర్ డి ఎ కార్యాలయం వద్దకు వచ్చి తనను బతిమలాడుకుంటేనే పనిలోకి రానిస్తానంటూ కార్మికులను బెదిరిస్తున్నాడని ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం వద్దకు వెళ్లి పోట్లాడి జీతాలు తీసుకు వస్తున్నానని చెబుతున్న నరసింహారావు మూడు నెలల జీతం ఎందుకు చెల్లించడం లేదని కార్మికులు ప్రశ్నిస్తున్నారన్నారు. నరసింహారావు పై గతంలోనే సి ఆర్ డి ఎ ఉన్నతాధికారులకు కార్మికులు,కార్మిక సంఘం నేతలు ఫిర్యాదు చేశారన్నారు. ఇప్పటికైనా కార్మికులకు మే, జూన్ నెల జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో మరోసారి పెద్ద ఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని ప్రకటనలో రవి హెచ్చరించారు.

ఫిజియోథెరపీతో ఉజ్వల భవిష్యత్తు

ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ పి చంద్రశేఖర రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మనిషి ఆధునిక జీవన శైలికి అనుగుణంగా ఫిజియోథెరపీ విద్య నూతనత్వం సంతరించుకుంటున్నదని, విదేశాలతో పాటు దేశీయంగా విద్య ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని శ్రీ రామచంద్ర చిన్న పిల్లల వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ పి. చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.హారిక ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థ హారిక ఫిజియోథెరపీ కళాశాల 2022-23 విద్యా సంవత్సర ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక అరండల్ పేటలోని సూర్య ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిజియోథెరపీపై ప్రజల్లో నానాటికీ అవగాహన పెరుగుతున్నదని, అన్ని వ్యాధులకు చికిత్సకు ముందు చికిత్స తర్వాత ఫిజియోథెరపీ వైద్యుల అవసరం పెరుగుతున్నదని తెలియజేశారు గర్భం నుండి సమాధి స్థితి వరకు అనేక దశలలో ఫిజియోథెరపీ వైద్యంతో మనిషికి అవసరతలు పెరిగిందని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ షేక్. సుభాని మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నాణ్యమైన డిగ్రీ, డిప్లమా కోర్సుల విద్యా బోధనకు హారిక ఫిజియోథెరపీ కళాశాల చిరునామాగా మారిందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ షేక్ మహీనా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికృష్ణ అధ్యాపకులు, డాక్టర్ సామ్యూల్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పుష్పలత, షేక్ మస్తానమ్మ, తదితరులు పాల్గొన్నారు

వేడుకలను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఎన్నికల అధికారిని ప్రశ్నిస్తున్న టిడిపి నాయకులు, ఓటర్లు

ఓట్లు గల్లంతు

అధికార పార్టీ చేసిందని టిడిపి ఆరోపణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు :మేము మరణించలేదు బతికే ఉన్నం మా ఓట్లు ఏవి అని నడింపాలెం గ్రామనికి చెందిన ఓటర్లు ఎలక్షన్ సినియర్ ఆసిస్టెంట్ మణిక్యరావుని ప్రశ్నించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యలయంలో నడింపాలెం గ్రామనికి చెందిన ఓటర్లు ఏలిక పోలేరు, వీరయ్య, అంజయ్య ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేవన్నారు. స్టానిక టిడిపి నాయకులు గింజుపల్లి శివరామ్ ప్రసాద్ మాట్లాడుతు అధికార పార్టీ నాయకుల ప్రోద్భలంతోనే ఓట్లు తొలగిస్తున్నారన్నారు. ఓటు తొలగింపు దగ్గర సంతకం పెట్టినవారిని చూపాలని అధికారులను పట్టుబట్టారు. ప్రతి గ్రామంలో తాము పరిశీలిస్తామని టిడిపి నాయకులు చెప్పారు. అయితే తమ పొరపాటు వల్ల జరిగి ఉంటుందని ఎలక్షన్ అధికారులు తెలిపారు.

సంస్కార హీనంగా మాట్లాడుతున్న సిఎం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్ వెంకటగిరి సభలో పవన్‌కల్యాణ్,ఇతర నాయకులపై సంస్కార హీనంగా మాట్లాడటం దారుణమని జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు. గుంటూరులోని జనసేన కార్యాలయంలో శనివారంఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎవరైనా ముఖ్యమంత్రి ఒక ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్ళినప్పుడు వారి హయాంలో జరిగిన గొప్ప కార్యక్రమాలు, ఇకపై చెయ్యబోయే ప్రణాళికల గురించి చెబుతారని సిఎం జగన్ అందుకు విరుద్ధంగా ప్రతిపక్ష నాయకుల వ్యక్తిగత జీవితాలపై ఇష్టానుసారంగా ప్రజల ముందు నిసిగ్గుగా మాట్లాడటం దేశంలో ఎక్కడా లేదన్నారు. పవన్‌కల్యాణ్‌కు గోదావరి జిల్లాల్లో వచ్చిన జనాదరణను చూసి ఓర్వలేక వ్యక్తిగత విమర్శలకు దిగారని అన్నారు. వాలంటీర్ల వ్యవస్థపై విమర్శలను పరిశీలించి తప్పులు చేసిన వారిని శిక్షించాలే పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని చెడుగా చూపించి వాలంటీర్లను గొప్పవారిగా చిత్రీకరించడం తగదన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా నాయకులూ అడపా మాణిక్యాలరావు, బిట్రగుంట మల్లిక, నారదాసు రామచంద్ర ప్రసాద్,కార్పొరేటర్ యర్రంశెటీ పద్మావతి,చట్టాలు త్రినాథ్, కూరపాటి నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, నెల్లూరి రాజేష్, గోపిశెట్టి సాయి, బీసాబత్తిన సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు..

కేంద్రం నిధులివ్వకుంటే మేమే కట్టిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. ఈ ఇళ్ళ నిర్మాణానికి కేంద్రం ఒప్పుకోక పోయినా మొత్తం భారం భరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సిఎం జగన్ ఎప్పుడూ పేదల పక్షపాతిగానే ఉంటారని తెలిపారు. పేదలు అమరావతిలో ఉండద్దనేది కేవలం సంపన్న వర్గాలే ఉండాలనేది చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. చంద్రబాబుకు కొన్ని వర్గాల పట్ల ద్వేషం ఉందని ఇళ్ళ నిర్మాణాలు చూశాక చంద్రబాబు కుళ్ళు కోవడం ఖాయం. పేదలు కోటీశ్వరులు కావడం ఖాయమని తెలిపారు.కోర్టులో కేసులు వేసి రాజధానిలో అభివృద్ధిని అడ్డుకున్నారని అన్నారు. రైతుల ముసుగులో ఇక్కడ భూములు కొన్నది టిడిపి నేతలేనని తెలిపారు. పేదలకు ఇళ్లనిర్మిస్తే రాజధానిలో డెమోగ్రాఫిక్ ఇన్ బ్యాలెన్స్ వస్తు ందనే పదాలు చంద్రబాబుకే సాధ్యం అన్నారు. రాష్ట్ర మంత్రులు జోగి రమేష్,మేరుగ నాగార్జున, లోక్‌సభసభ్యుడు నందిగం సురేష్, సిఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురామ్, శాసనమండలి సభ్యులు మురుగుడు హనుమంతరావు జంగా కృష్ణ మూర్తి, లేళ్ళ అప్పిరెడ్డి,కల్పలతారెడ్డి,చంద్రగిరి ఏసురత్నం,గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు,జడ్ పి ఛైర్మన్ కత్తెర క్రిస్టీనా,పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి,సిఆర్డిఏ కమీషనర్ వివేక్ యాదవ్ వైసిపి ఇన్ ఛార్జ్ కత్తెర సురేష్ కుమార్,డిసిసిబి ఛైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు,ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి,ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి,పార్టీ విధ్యార్ధి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య,కాపు కార్పోరేషన్ ఛైర్మన్ అడపా శేషు పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ నేతలు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-తెనాలి

గంజాయి కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ బి.జనార్ధనరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. పాతకేసుల్లో నిందితులైన ఇరువురు, మరో ఇరువురు వ్యక్తులతో కలిసి గంజాయి సేవిస్తూ, మరికొంత గంజాయిని విక్రయించేందుకు సిద్దంగా ఉంచిన నేపధ్యంలో అందిన సమాచారం మేరకు సిఐ ఎస్.వెంకట్రావ్ సారధ్యంలోని బృందం శుక్రవారం దాడి చేశారు. స్థానిక ఐతానగర్ క్రిస్టియన్ స్మశాన వాటికలో గంజాయి సేవిస్తున్న రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన అయిలా శ్రీనివాస్ అలియాస్ సాయి, పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన గంజి లూర్ధు రాజు, నాజరుపేటకు చెందిన బత్తిన అజయ్‌కుమార్, బిసి కాలనీకి చెంది కూతాటి గోపిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 1.6కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిలో పాతనేరస్తుడైన అయిలా శ్రీనివాస్ పలు దొంగతనాలు కేసుల్లో నిందితుడు, అలాగేటూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు నెలల క్రితం గంజాయి కేసులో కూడా నిందితుడే. రెండో ముద్దాయి గంజి లూర్ధు రాజు కూడా గతంలో ఓ రాబరి కేసులో జైలు శిక్ష అనుభవించాడు. వీరిరువురికి బత్తిన అజయ్‌కుమార్, కూతాటి గోపి మిత్రులు, గంజాయికి బానిసలు. ఈ నేపద్యంలో అయిలా శ్రీనివాస్ అరకు ప్రాంతం నుంచి ఇటీవల కేజీ రూ.5వేల చొప్పున రెండు కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. మిగిలిని ముగ్గురితో కలిసి కొంత విక్రయించేందుకు చిన్న చిన్న పొట్లాలుగా కట్టి ఉంచారు. మరి కొంత సేవించే క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారని డిఎస్పీ చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నామన్నారు. సమావేశంలో సిఐ ఎస్.వెంక్రట్రావ్, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ, నిందితులు(ముసుగులో)

దొంగతనం కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్

రెండు బైక్‌లు, రూ.3వేల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురు నిందితులను పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐ కె.చంద్రశేఖర్ వివరాలు తలిపారు. ఈనెల 14వ తేదీన పట్టణంలోని పన్నాలవారి వీధికి చెందిన గూడూరు సంపూర్ణ సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వెనుకగా బైక్‌పై వచ్చిన ఇరువురు నిందితులు అమెను ఆడ్డుకుని, సైకిల్‌కు ముందు ఉన్న బాస్కెట్‌లో బ్యాగు లాక్కున్నారు. అమె ప్రతిఘటించినా ప్రయోజనం లేకపోయింది. బ్యాగులో రూ.3వేల నగదు, మొబైల్ ఉన్నట్లు బాధితురాలు చేసిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపధ్యంలో చినరావూరు రైల్వే గేటు వద్ద శుక్రవారం రాత్రి పట్టణానికి చెందిన కోలా రత్నరాజు అలియాస్ రాజు, వల్లెపు బ్రహ్మయ్య అలియాస్ బ్రహ్మి(18)ని అరెస్ట్ చేశారు. కోలా రత్నరాజు దాదాపు 11 కేసుల్లో నిందితుడు. అలాగే బ్రహ్మయ్య చీరాల ప్రాంతానికి చెందినవాడు. ఇటీవలి కాలంలో ఐతానగర్ కడియాల వారి వీధిలో ఉంటున్నాడు. మిత్రులైన ఇరువురూ పట్టణ టౌటౌన్ పోలీస్ స్టేషన్, కొల్లిపర పోలీస్ స్టేషన్ పరిధిలో అపహరణకు గురైన రెండు హీరో హోండా స్పెండర్ బైక్‌ల అపహరణకు పాల్పడినట్లు పోలీసులు విచారణలో వెల్లడిం చారు. నిందితుల నుంచి మహిళ బ్యాగులో అపహరించిన రూ.3వేలు, రూ.96వేల విలువ కలిగిన రెండు బైకులను స్వాదీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సిఐ చెప్పారు. చోరీ కేసును చేధించిన సిఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐలు ఉమా మహేశ్వ రరావు, డేవిడ్, ఏఎస్ఐ కె.రత్నరాజు, పిసిలు ఎన్.శ్రీనివాసరావు, ఎస్‌కెఎండి షరీఫ్‌ను డిఎస్పీ అభినందించినట్లు సిఐ తెలిపారు.

పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు, స్వాదీనం చేసుకున్న బైక్‌లు

జాబ్‌మేళాకు విశేష స్పందన

మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను రూపు మాపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుందని రాష్ట్ర కుటుంబ సంక్షేమ వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శనివారం స్థానిక పాత మా ర్కెట్ యార్డ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు 15 కంపెనీలు హాజరు కాగా అందులో నిరుద్యోగులు 317 మంది హాజరయ్యారన్నారు. వారిలో 104 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి జాయినింగ్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారందరినీ మంత్రి అభినందించారు. అనంతరం పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె సంజీవరా వు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలనుసారంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపిక అ యిన వారిని ప్రత్యేకంగా అభినందించి వారి ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించి నై పుణ్యాలను పెపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో పిడి డిఆర్‌డిఎ అధికారి బి బా లు నాయక్, మున్సిపల్ చైర్మన్ రఫానీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మార్కెట్ యార్డు సెక్రెటరీ ఉమామహేశ్వరరావు, జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారితో మంత్రి విడదల రజని, తదితరులు

ఘనంగా నో బ్యాగ్ డే వేడుకలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని సిద్ధార్థ నగర్‌లో సాయిరాం పాఠశాలలో నో బ్యాగ్ డే కార్యక్రమము పాఠశాల డైరెక్టర్ చంద్ర ముప్పాళ్ళ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా వినుకొండ పట్టణ సర్కిల్ ఇనస్పెక్టర్ ఎస్. సాంబశివ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పిల్లల మానసిక ఆరోగ్యం వృద్ధి చెందేలా, వారిలో నూతన ఉత్సాహాన్ని నింపే ఇలాంటి కార్యక్రమాల్ని మరెన్నో జరపాలని పాఠశాల అధినేత చంద్రముప్పాళ్ళని అభినందించారు. విద్యార్థులలోని మేధాశక్తిని తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేసి వాళ్ళ నుంచి సమాధానాన్ని రాబట్టారు. చదువు పట్ల విద్యార్థులకు ఆశక్తి గలిగేలా చెప్పి విద్యార్థులు చెప్పిన సమాధాలకు మెచ్చి వారికి నగదు బహుమతి అందచేశారు. మరో ముఖ్య అతిధి రవీంద్ర హైస్కూల్ అధినేత అయిన షేక్ సుబాని మాట్లాడుతూ పాఠశాలలో ఆటపాటలతో కూడా విద్యార్థులను మంచి ఉత్సాహవంతులుగా చేస్తున్నారని, చదువుతో పాటు చక్కని క్రమశిక్షణ అందిస్తున్నారని భవిషత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి విద్యాసంస్థను ఇంకా వృద్ధిలోకి తేవాలని చంద్రాముప్పాళ్ళను అభినందించారు.

రాష్ట్రస్థాయి రంగస్థల, పౌరాణిక పద్య పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ

మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమాన్ని జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన స్థానిక జాషువా కళా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు మందా వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అఖిలభారత యాదవ మహా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దుల వెంకట కోటయ్య యాదవ్‌ను చిలకలూరిపేటలోని వారి స్వగృహంలో కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సంద ర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రెడ్డి బోయిన ప్రసన్నకుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ) రి.నెం. ABC-CS/006/2015,
H.O. ABCCS, Endowments Commissionersate Campus, Gollapudi, Vijayawada, Krishna (D), A.P - 521 225, Ph : 0866-6650307
B.O : ABCCS, C/o yadavalli Vari Satram, Beside Modern Theatre, Kothapeta, Guntur, Guntur (D), A.P-522201 Ph : 0863-2958557, 92810 29467

ఈ ప్రకటనలోని వారి తాలూకా ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తి పై సొసైటీ నందు తనఖా పెట్టి, సొసైటీ నుంచి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు తనఖాపై సొసైటీవారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజుల లోపుగా లిఖిత పూర్వకంగా వారి అభ్యంతరములను రిజిష్టరు పోస్టు విత్ ఎక్నాలెడ్జిమెంట్ ద్వారా బ్యాంకుకు తెలియపర్చవలసినదిగా కోరుతున్నాము.

వ.నెం.	పేరు	స్థిరాస్తి వివరములు
1.	MS Vedantham Seshukumari W/o :- Vedantam Narasimha Murthy App : 88284 Mobile No. 9490776490 Mr. SKRN Sasank S/o :- SVS Acharyulu App : 88283 Mobile No. 9553688605	An extent of 144.Sq. yards of House site along with RCC roofed Building there in D.No. 340, Assessment No. 6545, Situated at Dr.No.7-16, Abbineniguntapalem Village Panchayath, Prathipadu Mandal, Guntur Dist. A.P.-522015. Value : Rs.30.00 lacs

Guntur
Dt. 20/07/2023

Sd/- DVS PAVAN KUMAR
Branch Manager

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టు, గుంటూరు.

ఐ.ఎ. 309/2023 ఇన్ ఓ.యస్. 687/2014

బిట్వీన్ :
తోట లక్ష్మణరావు ... పిటీషనర్ / వాది
మరియు
మంత్రవాది సీతామనోహరం (డైడ్) మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు,
మంత్రవాది ప్రతిభ, తండ్రి : ప్రభాకరరావు (లేటు), కేరాఫ్ మంత్రవాది సంగమేశ్వర్, డోర్ నెం. 34/బి, సత్యనారాయణస్వామి దేవాలయం వీధి, రవీంద్రనగర్, పట్టాభిపురం, గుంటూరు.
... ప్రపోజ్డ్ రెస్పాండెంట్ / డిఫెండెంట్ నెం.3

పైన పేర్కొన్న దావాలో గౌరవనీయులైన కోర్టువారు మీకు సమన్లు అనేకమార్లు ఇచ్చినప్పటికినీ మీరు తీసుకోక పోయినందున పేపరు ప్రకటన ద్వారా 13-7-2023న నోటీసు ఆర్డరు వేసియున్నారు. మీరు స్వయంగా గానీ, లేదా మీ ప్లీడరుగారి ద్వారా 14-8-2023 గౌరవనీయులైన రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉదయం 10-30 గం.లకు మీరు హాజరు కావాల్సివుంది. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానం చేయబడుతుందని తెలియ జేయడమైనది.

వాయిదాతేది : 14-8-2023

కె.వరప్రసాద్,
వాది తరపు అడ్వకేట్, గుంటూరు.
సెల్ : 7893862499

బహిరంగ ప్రకటన

నాక్లయింటు అయిన గుంటూరుసిటీ, కొరిటెపాడు, వినాయక టెంపుల్ దగ్గర, డోర్.నెం.4-6-333 కాపురస్తులు నందిపాటి శివశంకర్ రెడ్డి, తండ్రి. మహానంది రెడ్డి గారి సూచనల మేరకు యావన్మం దికి తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు తన బాకీ వసూలు నిమిత్తం తోకల లీలావతి, భర్త చినపోతురాజు గారియొక్క షెడ్యూలు ఆస్తిని ఎటాచ్‌మెంట్ కోరుతూ మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో ఓ.యస్. నెం.867/2023గా దావా దాఖలు చేసుకొని షెడ్యూలు ఆస్తిని ఎటాచ్‌మెంట్ కోరుతూ పిటీషన్ దాఖలు చేసుకొనియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి కోర్టులో పెండింగ్‌లో వుండగా దావాలోని ప్రతివాది అయిన తోకల లీలావతి గారు షెడ్యూలు ఆస్తిని ఇతరులకు అన్యాక్రాంతము చేయాలనే తలంపుతో ఉన్నట్లుగా నాక్లయింటుకు తెలియవచ్చినది. కావున ఎవరైనా షెడ్యూలు దాఖలా ఆస్తి గురించి సదరు లీలావతి గారితో జరిపేటటువంటి క్రయ విక్రయాలు చెల్ల నేరవని మరియు చట్టప్రకారము నాక్లయింటు తీసుకొను అన్ని చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయడమైనది.

షెడ్యూలు: గుంటూరు డి॥ & సబ్.డి., జి.యం.సి. ఏరియా, గుంటూరు సిటీ, కొత్తపేట గణేశ్వరరావు వీధి, వార్డు నెం.12, బ్లాక్ నెం.7, టి.యస్.నెం.93 మింజుమలె 55.6లు స్థలము అందలి అసిస్మెంట్ నెం.56781, డోర్.నెం.12-7-144 గల ఖాళీ స్థలము అందలి పెంకుటిల్లుకు **హద్దులు. తూర్పు:** పి. రాములమ్మగారి ఆస్తిహద్దు,**దక్షిణం:**రోడ్డుహద్దు, **పడమర:** రోడ్డుహద్దు, **ఉత్తరం:**తోకల సాంబశివ రావుగారి ఆస్తిగోడ హద్దు.

పి.శ్యామ్ కుమార్, న్యాయవాది
6/13బి, బ్రాడీపేట, గుంటూరు.సెల్ : 8985133998

సాహిత్య విదూషిమణి శ్రీరంగనాయకి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగర సాహిత్యరంగ మహిళా విదూషిమణి డాక్టర్ కోగంటి శ్రీరంగనాయకి అని ఉపన్యాస భారతి మంచికంటి సత్యవతి పేర్కొన్నారు. శనివారం స్థానిక బృందావన్ గార్డెన్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, పద్మావతి కల్యాణ వేదికపై డాక్టర్ శ్రీరంగనాయకి సంకలనం చేసిన 'శ్రీ గోదా స్తుతి మాలిక' గ్రందాన్ని బొల్లెపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు ఆవిష్కరించారు. గుది మెళ్ళ కూర్మనాథస్వామి అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ దీవి నరసింహ దీక్షిత్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయక, దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రెంటచింతల

మూడు నెలలకోసారి నిర్వహించే మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాలకు కారణం లేకుండా గైర్హాజరయ్యే అధికారులపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరుగుతుందని జిల్లా అభివద్ధి అధికారి రెంటచింతల ఎంపీడీవో వై మహాలక్ష్మి హెచ్చరించారు. శనివారం 5వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అధ్యక్షతన నిర్వ హించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల స్థాయి అధికారులంతా సమావేశాలకు వస్తే ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి అన్నారు ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరగడం లేదని సభ్యులు చెప్పారు జగనన్న సురక్ష, ఐసిడిఎస్,గ్రామాల్లో పారిశుద్ధ్యం, హౌసింగ్ నిర్మాణం, ఫ్యామిలీ ఫిజీషియన్, రాత్రి పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలగడం పైచర్చించారు. సమావేశంలో జడ్పి వైస్ చైర్మన్ నర్సిరెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షులు మాచర్ల అచ్చమ్మ పాల్గొన్నారు.

స్నేహ హస్తాలు ఫౌండేషన్ బెంచీలు అందజేత

ప్రజాశక్తి-బెల్లంకొండ

స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెల్లంకొండ పోలీస్‌స్టేషన్ కు రూ.35,000 విలువ గల 10 సిమెంట్ బెంచీలను స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి కూరపాటి మధు (అమెరికా) బెల్లంకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె. అమీర్ అందజేశారు. ఈ సంద ర్భంగా ఎస్సై కె. అమీర్ మాట్లాడుతూ స్టేషన్ కి వచ్చే ప్రజల కోసం బెంచీలు ఏర్పాటు చేసినందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్‌ను ప్రత్యేకంగా అభినందించారు, కార్యక్రమంలో వడ్లమూడి ఆంజనేయులు (జానపాడు), స్నేహ హస్తాలు కో - ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు పాల్గొన్నారు.

సాగు పత్రాలున్న కౌలు రైతులకు ఈ-పంట నమోదు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పంటల సాగు పత్రాలు ఉన్నా కౌలు రైతుల పేర్లు మాత్రమే ఈ పంటలో నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీధర్ రెడ్డి అన్నారు. సత్తెనపల్లి తహశీల్దార్ కార్యాలయం లో వీఆర్వో వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు ఖరీఫ్-2023 సీజన్ నకు ఈ - పంట నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు . ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ఈ పంట నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఓ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది అన్ని పంటలను ఈ పంటలో నమోదు చేయాలని సూచించారు. కౌలు రైతులు అందరూ తప్పనిసరిగా భూ యజమాని అంగీకారం తో సాగుదారు కార్డులు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద నుండి పొందుకోవాలని సూచించారు.

మణిపూర్ ఘటనపై ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి-అమరావతి

స్థానిక అమరావతిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మణిపూర్‌లో అల్లరి మూకలు ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిన ఘటనపై అమరావతిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాలు నాయకులు, అమరావతి మండల సిపిఎం కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ఆడవాళ్ళ హక్కుల సంఘం నాయకులు తుండు లక్ష్మణ్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలో దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ారృక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బి.రామకృష్ణ, తెలుగు రైతు సంఘం నాయకులు బి.వెంకటేశ్వరరావు, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వి. అనిల్ కుమార్, సంఘ నాయకులు మోదున్వలి,పిఎస్ నాయకులు ఎస్.రాజకుమార్, సిఐటియు నాయకులు షేక్ రఫీ, గుడిసె సతీష్ పాల్గొన్నారు.

హరించుకు పోతున్న మానవ హక్కులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

మణిపూర్‌లో మానవ హక్కులు హరించి పోతున్నాయని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని జై భీం భారత్ పార్టీ పల్నాడు జిల్లా నాయకులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ అన్నారు. మణిపూర్ ఘటనకు నిరసనగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భముగా విజయ్ మాట్లాడుతూ అక్కడ తెగల మధ్య మారణహోమం జరుగుతుంటే 'మేక్ ఇన్ ఇండియా' జపం చేస్తున్న ప్రధాని మోడీ ఎందుకు మౌనం వహిస్తున్నారని విమర్శించారు. అక్కడి ప్రజల్లో నెలకొన్న భయ భ్రాంతులను తొలగించి శాంతి భద్రతలను స్థాపించాలని, అదేవిధంగా ఘటనకు బాధ్యులు అయిన వారిని అరెస్టు చేయలని డిమాండ్ చేశారు. ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహంకాళి, వెంకట్రావు, అంబేద్కర్ ప్రజాసంఘాల అధ్యక్షులు డి.కోటేశ్వరరావు, మాల మహానాడు నాయకులు గుంటూరు ఆశీర్వాదం, మాతంగి సుదాక్రావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో సంఘీభావం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మణిపూర్ అల్లర్లలో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి వారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన అమానవీయ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏ.పి.జె. కలామ్స్ విజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, పల్నాడు బాణావతు వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. ఈ ఘటన యావత్ భారతదేశాన్ని సిగ్గుపడేలా చేసిందని అన్నారు. కెపి గూడెం వాసులు కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపారు.

ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

దేశంలోని మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండను వెంటనే నిలిపివేయాలని మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను హత్యలను ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. నరసరావుపేటలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి 2024 ఎన్నికల్లో తిరిగి అధికారమే ధ్యేయంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో మత కల్లోలాలు రేపుతోందని విమర్శించారు. మణిపూర్ ఘటనలకు ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షాలు బాధ్యత వహించాలన్నారు. ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉన్న మన దేశంలో మహిళలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంటే దేశం లో ని మహిళలోకం తలెత్తుకోలేని పరిస్థితుల్లో ఉందన్నారు. అత్యాచారం చేసి హత్యలు చేస్తున్న మానవ మృగాలను వెంటనే అరెస్టు చేసి తీవ్రమైన శిక్షలు విధించాలని, మణిపూర్ లో రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ సిపిఐ కార్యదర్శి వైదన వెంకట్, ఎఐటియుసి నాయకులు యు.రంగయ్య, చిన్న జాను సైదా, జె.వెంకటేశ్వర్లు, శ్యామల, వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ గౌస్ , శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అమరావతిలో..

సత్తెనపల్లిలో..

కెపిగూడెంలో..

సమావేశంలో మాట్లాడుతున్న మారుతివరప్రసాద్

24న నిరసన దీక్షను జయప్రదం చేయండి

- విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి
- ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కమిటీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి కోటా సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పుతుంబాక భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన చేపట్టనున్న నిరసన దీక్ష ను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 49 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్త కాలు ఇవ్వకపోవడం సిగ్గు చేటని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వారికి గతంలో ఉచితంగా ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలు ఇచ్చేదని, నేడు నిరాకరిస్తోందంటే పేద విద్యార్థులకు చదువును దూరం చేయడమే తప్ప మరొకటి కాదని విమర్శించారు.

'అమ్మ ఒడి' బూచి చూపించి పుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వము ఆటలాడుతోందని అన్నారు. మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. పుస్తకాలు, అధ్యాపకులు లేనందునే గత విద్యా సంవత్సరం జూనియర్ కళాశాలల్లో 36 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారన్న విషయం ప్రభుత్వం గుర్తుంచుకోవాలని అన్నారు. నేటికీ 474 ఇంటర్మీడియట్ కళాశాలలో 210 కాలేజీల్లో ప్రిన్సిపల్స్ లేరని, 26 జిల్లాలకు పర్మినెంట్ ఆర్ఐఒలు, 13 డివైఇఒలు లేరని అన్నారు. దీనివల్ల ఇంటర్మీడియట్ అడ్మినిస్ట్రేషన్, సిలబస్ ప్రణాళిక తూతూ మంత్రంగా నడుస్తోందని విమర్శించారు. దీన్ని ప్రభుత్వం గుణపాఠం తీసుకొని ఈ సమస్యలన్నీ ప్రభు త్వం పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో సత్తెనపల్లి కార్యదర్శి అమూల్య, కమలాకర్ , జోసెఫ్, ఆకాష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుత్ను కోటా సాయికుమార్

సానుభూతిపరుల ఓట్ల తొలగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఈపూరు

తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తీసివేస్తు న్నారని తహశీల్దార్ ఆర్ వెంకటేశ్వర్లు నాయక్ మండల టిడిపి నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా గ్రామ వాలంటీర్లు అంది ంచిన సమాచారంతో ఓట్ల మార్పులు, చేర్పులు ప్రక్రియలో గ్రామ వాలంటీర్లు పాల్గొనకుండా చూడాలన్నారు. ఉన్నవారివి ఓట్లు తొలగించడం, డబల్ ఎంట్రీ లపై తహసిల్దార్ తో చర్చిం చారు. ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల శెట్టి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయండి

26న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-వినుకొండ

ఏపీ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద ఎంబివికె భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని డివిజన్ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా 132 ఎస్ఎస్ లో శనివారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కూడా ప్రజలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, చనిపోయిన కార్మిక కుటుంబాలలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు షేక్.బాషా, భాస్కర్ పాల్గొన్నారు.

మణిపూర్ మహిళలపై జరుగుతున్న హింసను ఆపాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మణిపూర్ మహిళలపై జరుగుతున్న హింసను ఆపాలని ఆంధ్రప్రదేశ్ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి అన్నారు. శనివారం గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, వడ్డేశ్వరం సుందరయ్య స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నుండి వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్దకు విద్యార్థినీలతో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, మరియు సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద మానవహారంగా ఏర్పడి, మణిపూర్ ఘటనపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఆపేందుకు ప్రధానమంత్రి మోడీ పూనుకోవాలన్నారు. హింసను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. గత 80 రోజుల నుండి మణిపూర్ లో మైతీ, కుకి తెగల మధ్య మొదలైన హింసకాండ వలన 150 మంది హత్య చేయబడ్డారని అన్నారు. అదేవిధంగా ప్రతిరోజు మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని ఆమె ఆవేదన చెందారు. అనేకమంది కుకీ తెగకు సంబంధించిన గిరిజనుల గృహాలను తగలబెడుతున్న కనీసం నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించకపోవడంచూస్తుంటే, కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాల అండదండలతోనే ఇలాంటి హింసలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే మణిపూర్లో శాంతిని నెలకొల్పాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే నెలలో మహిళలను వివస్త్రను చేసి , రోడ్లమీద బహిరంగంగా నడిపించిన వీడియో సోషల్ మీడియా ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిసిన తర్వాత రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామన్న అన్నారు. కార్గిల్ అమరవీరుడి భార్యను వీడియోలో చూపినట్లుగ వివస్త్రను చేసి, అత్యాచారం అనంతరం హత్య చేసిన ఘటన యావత్ భారతదేశం తలదించుకునేలా ఉందన్నారు. బయటకు రాకుండా జరుగుతున్న అనేక అఘాయిత్యాలకు, హింసలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మణిపూర్ లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ అన్నారు. గిరిజన ప్రాంతాలపై, గిరిజన రిజర్వేషన్ ఇస్తామని, మైతీ తెగ ప్రజలకు హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం నేడు మత కలహాలుగా మారాయి అన్నారు. అంతేకాకుండా చర్చిలను తగలబెడుతూ క్రిస్టియన్ పాస్టర్లను చంపుతున్నారని అన్నారు. ఈ ఘటనలన్నీ బిజెపి హిందుత్వ ఎజెండాలో భాగమేనని ఆయన దుయ్యబట్టారు. మణిపూర్ లో జరిగే అరాచక శక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు బాలాజీ అన్నారు. తక్షణమే మణిపూర్లో శాంతిని నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ సమైక్యతను కోరుకునే మేధావులు, ప్రజాస్వామిక వాదులు నరేంద్ర మోడీ ప్రభుత్వ మతోన్మాద చర్యలను ఖండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మనోజ్ కుమార్, ఐద్వా నాయకులు జ్యోతి, పద్మ, నాగమణి, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి:మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ తెనాలి శాఖ డిమాండ్ చేసింది. మణుపూర్‌లో జరుగుతున్న హింసకు నిరసనగా శనివారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ తెనాలి మండల అధ్యక్ష కార్యదర్శులు సుభాష్ ఉదయ్, ఈశ్వర్ మాట్లాడుతూ మణిపూర్లో గతంలో ఎన్నడు చూడని విధంగా హింసకు తెర తీశారన్నారు. ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రధాని మోడీ కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు. హింసను పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందేమోనన్న భావన వ్యక్తం చేశారు. మహిళలను వివస్త్ర చేసి రోడ్లమీద బహిరంగంగా నడిపించిన వీడియో సోషల్ మీడియా ద్వారా ప్రపంచానికి తెలిసిన తర్వాత మాత్రమే ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయటం ప్రభుత్వాల వైఫల్యాన్ని స్పష్టం చేస్తుందన్నారు. మణిపూర్ లో మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, తక్షణమే అక్కడ శాంతి నెలకొల్పేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి-మంగళగిరి :మణిపూర్ లో జరుగుతున్న అత్యాచారం ఘటనను నిరసిస్తూ శనివారం మంగళగిరి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో క్రైస్తవ సంఘాలు, దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గౌతమ్ బుద్ధ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. 2024 లో జరిగే ఎన్నికల్లో బిజెపిని ఓడించడానికి కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు కే రవికుమార్, బి రవి ప్రకాష్, ఈ సహదేవ్, సిపిఎం నాయకులు జెవి రాఘవులు, పి బాలకష్ణ, ఎస్ ఎస్ చాంగయ్య, జి డేవిడ్ రాజు, సిపిఐ నాయకులు గంజి వెంకయ్య, దళిత సంఘాల నాయకులు కే రామారావు, జేఏసీ నాయకులు ఎండి యూసుఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్ :మణిపూర్ లో జరిగిన ఘోర సంఘటనలో లో దోషులను వెంటనే ఉరితీయాలని మాల యువసేన ఆధ్వర్యంలో పొన్నూరు అంబేద్కర్ సెంటర్ లో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాల యువసేన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పొందుగల చైతన్య, పెరికల రమణయ్య, దళిత మహాసభ పెదపూడి సుధాకర్, న్యాయవాది దేవరపల్లి సునీల్ బిఎస్పి పార్టీ పొన్నూరు నియోజక వర్గ ఇంచార్జ్ యాతటి కిషోర్, తెలంగతోటి మాణిక్యారావు పాల్గొన్నారు.

వడ్డేశ్వరం వద్ద నిరసనలో పాల్గొన్న డి రమాదేవి తదితరులు

మంగళగిరిలో నిరసన

తెనాలిలో నిరసన

పొన్నూరులో నిరసన

ముఖ్యమంత్రిదే అంతిమ నిర్ణయం

ప్రజాశక్తి - తుళ్లూరు

మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపిక జగన్ మోహన్ రెడ్డి అభీష్టం మేరకు జరుగుతుందని, ఆయన నిర్ణయం శిరోధార్యమని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. రాజధాని ప్రాంతం వెంకటపాలెంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయాలకు అందరూ కట్టుబడి ఉన్నారని చెప్పారు. తాడికొండ నియోజక వర్గం సమన్వయ కర్తగా ఉన్న కత్తెర సురేష్ కుమార్ సేవలను పార్టీ వినియోగించు కుంటుందని చెప్పారు. సురేష్ కుమార్ నిర్వహిస్తోన్న పార్టీ కార్యక్రమాలకు వైసిపి జిల్లా పార్టీ అండగా ఉంటోందని చెప్పారు. డొక్కా వెంట వైసిపి నాయకులు నాయుడు నాగేశ్వరరావు, మాదల వెంగలరెడ్డి, గాదె నాగేశ్వర రావు, ఎ జక్రయ్య, భోగినేని అప్పారావు, జమ్ముల శ్రీనివాసరావు, పి సుబ్బారావు, షరీఫ్, గంజిమాల రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫోటో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సంఘం జాగర్లమూడి పాఠశాలలో 1988-89లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసారు. శనివారం స్థానిక హోటల్ స్వర్ణ ఇన్ లో వారంతా సమావేశమయ్యారు. పరస్పరం ఆలింగనం చేసుకొని పాఠశాలలో జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. 2015 లో గ్రూపుగా ఏర్పడిన విద్యార్థుల సంఘం పలు సేవా కార్యక్రమాలలో పాల్గొని పలువురు ప్రశంసలు అందుకున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు ఐ రాజేష్ ఖన్నా తెలిపారు. దేశవిదేశాల్లో స్థిరపడిన ఉన్నతస్థాయి ఉద్యోగులు పాఠశాల అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. 34 యేళ్ల అనుబంధాన్ని గుర్తు చేసుకొని వారంతా ఆటపాటల్లో తేలియడారు. కార్యక్రమంలో ఎ సాంబశివరావు, హరిబాబు, డి దీప, వి రమేష్, యామిని, అనురాధ, శ్రీదేవి, టి మధు, వై మాణిక్యరావు, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

13 మందితో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తాడేపల్లి

న్యాయస్థానాలు తీర్పు ఇచ్చినా అంగన్‌వాడీలకు ప్రభుత్వం గ్రాడ్యూటీ అమలు చేయకపోవడం బాధాకరమని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కమిటీ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తాడేపల్లి మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమావేశం ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు, సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడారు. అంగన్వాడీలకుపని భారం పెరిగిందని, దానికి తగ్గట్లు జీతాలు మాత్రం పెరగడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణా రాష్ట్రం కంటే అదనంగా రూ. వెయ్యి పెంచుతామని ఇచ్చిన హామీని సిఎం జగన్ నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం 13 మందితో తాడేపల్లి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాయపూడి మాధురి, కార్యదర్శిగా కె.సబిత ఎన్నికయ్యారు.

ఆస్పత్రులలో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరుజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేశారు. మేడికొండూరు మండలం మందపాడు, గుంటూరుపశ్చిమ మండలం పెదపలకలూరు, మండల కేంద్రమైన యడ్లపాడు, చిలకలూరిపేట అర్బన్ హెల్త్ సెంటర్, బాపట్ల మండలం వెదుళ్లపల్లి, చీరాల మండలం ఈపూరుపాలెంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ, డాక్టర్ల హాజరు, పనితీరు, మందుల పంపిణీ, వసతులు, సౌకర్యాలు, రికార్డ్స్ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత మొదలగు అంశములను పరిశీలించారు. ఆయా ఆస్పత్రుల్లో ఉన్న లోపాలను నమోదు చేశారు. ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు. పై తనిఖీలలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్లు శ్రీహరి రావు, తహసిల్దార్, కె.నాగమల్లేశ్వర రావు, అసిస్టెంట్ ఎక్జ్యుకుటివ్ ఇంజనీర్ శివన్నారాయణ, వ్యవసాయ అధికారి వాసంతి, సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, సైదులు, సీనియర్ అసిస్టెంట్ కె. మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఎంబివికెలో

26న విద్యుత్ సంఘాల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారానికి వివిధ విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 26న ఉదయం 10 గంటలకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సిఐటియు అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు చెన్నకేశవులు, రాంప్రభాకర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు జి.పవన్, జి.నాగరాజు, కోశాధికారి కె.రాంబాబులు పిలుపునిచ్చారు. శనివారం వివిధ సబ్ స్టేషన్లలో రాష్ట్ర సదస్సు గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా పిఆర్‌సి చర్చలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయని, కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్ధీకరణపై తేల్చట్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంఘాలను లోబరుచుకొని తప్పుడు పిఆర్‌సి ప్రకటించిందని, అదే పద్ధతిని విద్యుత్ రంగంలో కూడా ప్రయోగించాలని ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యాలు కుట్ర చేస్తున్నాయన్నారు. విద్యుత్ రంగంలోని ఉద్యోగులు, కార్మికుల పోరాట చరిత్రను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని, ప్రభుత్వం, యాజమాన్యాల నిర్లక్ష్యం తీవ్రమైన ఉద్యమానికి దారి తీస్తుందని హెచ్చరించారు. వినతులతో, విజ్ఞానపనలతో యాజమాన్యాలు స్పందించట్లేదని, పోరాటమే మార్గమన్నారు. కావున భవిష్యత్ ఉద్యమాలకు సన్నాహకంగా జరిగే ఈ సదస్సులో ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలకు సంబంధించిన అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతులతో సమావేశం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

రాష్ట్రంలో రైతులు బాగుండాలని ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండా రెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపురం తండా రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులతో సమావేశం నిర్వహించారు.

నాడు-నేడు పేజ్- 2 త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి -రెంటచింతల

నాడు నేడు పేజ్ -2 పనులను త్వరగా పూర్తి చేయాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ శనివారం ఎంఈఓ లు హెచ్ఎం లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి కావాలన్నారు మండలంలో 14 పాఠశాలలకు 2 కోట్ల 10 లక్షల 12 వేలు కేటాయించినట్లు ఎంఈఓ శివ నాగేశ్వరరావు తెలిపారు.

టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని మన్నె సుల్తాన్ పాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చేవూరు వెంకటేశ్వర్లు భార్య బ్రహ్మమ్మ గత కొంతకాలం అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ శుక్రవారం రాత్రి గుంటూరు ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పెదకూరపాడు మాజీ శాసనసభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ వారి కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివ రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు అందరితో కలిసి మన్నె సుల్తాన్ పాలెం గ్రామానికి వచ్చి ఆమె పార్ధవ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నల్లమేకల లక్ష్మీనారాయణ, నాయకులు అక్కల వెంకటరామిరెడ్డి, యలగాల హనుమంతురావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల బృందం పరిశీలన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ , ఫ్యామిలీ వెల్ఫేర్ నుండి ఇద్దరు డాక్టర్లతో కూడిన కేంద్ర బందం పల్నాడు జిల్లాలో గత నాలుగు రోజులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి శోభారాణి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలను పర్యటిస్తూ జిల్లాలో అమలవుతున్న అన్ని రకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, ఆరోగ్య సేవలు వివిధ రకాల పథకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బృందంలో డాక్టర్ అనిత కుమారి, కెఆర్, డాక్టర్ సబిత దాస్ డీఎస్‌ల నేతృత్వంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఏరియా ఆసుపత్రి సందర్శించి మాతాశిశు సంరక్షణ సర్వీసులు,రక్త పరీక్ష రక్త పరీక్షల సర్వీసులు ,బ్లడ్ బ్యాంక్ నిర్వహణ, ఓపి విభాగాలను పరిశీలించారు. ప్రభుత్వ ప్రవేశపెడుతున్న అన్ని రకాల పథకాలు నిర్వహణ గురించి ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామీణ ప్రాంతాలలో అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంము, అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సందర్శించి అక్కడ అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పై ఆరా తీశారు.

నిర్దిష్ట కాలపరిమితిలో సర్వే పూర్తి చేయాలి

ఓటర్ల జాబితా సర్వే ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వివరాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట పట్టణంలోని 6 వార్డు వెంకట్ రెడ్డి నగర్ పార్క్ బజార్ లో జరుగుతున్న ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి వచ్చే నెల 30 వరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పై ప్రభుత్వం నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారుల ద్వారా చేపట్టారు. నరసరావు పేట నియోజక వర్గానికి సంబంధించి పట్టణంలో ఓటర్ల జాబితా సర్వే జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించి బూత్ లెవల్ అధికారుల కు పలు సూచనలు చేశారు. నిర్దిష్ట కాలపరిమితి లో సర్వే ప్రక్రియ ను పూర్తి చేయాలని, సర్వే చేసే విధానం డ్రెస్ కోడ్ ఐడెంటిటీ కార్డు తప్పనిసరి గా ఉండాలని అన్నారు.పూర్తిగా సమాచారం సేకరించిన వివరాలను రిజిస్ట్రేషన్ ద్వారా బుక్ లో నమోదు చేసుకోవాలని, అదే సమయంలో అన్ లైన్ లో కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఓటరు జాబితాలో వివరాలు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మొత్తం 3 గహాల్లో జరిగిన ఓటర్ల జాబితా సర్వేను జిల్లా కలెక్టర్ పరిశీలించి, త్వరిత గతిన సర్వే కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకోవాలని అర్.డి.ఓ శేషిరెడ్డి, మున్సిపల్ డి.ఇ శ్రీనివాస్, తహశీల్దార్ రమణా నాయక్ లకు పలు సూచనలు చేశారు. బి.ఎల్. ఓ వేంకటేశ్వర్లు కు ఓటర్ల జాబితా కి సంబంధించి పనులు వేగంగా జరిగేలా చూడాలని, ఆన్ లైన్ పని సాయంత్రం సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

సెమిస్టర్-2 పార్య పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ, గ్రామ స్థాయిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థినీ విద్యార్థు లకు సెమిస్టర్ 2 పార్య పుస్తకాల పం పిణీ లో భాగంగా చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ము నిసిపల్ ప్రాధమిక పాఠశాల యందు విద్యార్థినీ విద్యార్థులకు మండల వి ద్యా శాఖాధికారి వి.వి.యస్. రత్నక ళ శనివారం అందించారని ఆ పాఠశాల ప్రధా నోపాధ్యాయురాలు కె. సుధ అన్నారు. నవంబర్ లో సెమిస్టర్ 2 ప్రారంభం కా వాల్సి ఉన్నా ఈ నెల లోనే ఈపార్య పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. . పేరెంట్స్ మానిటరింగ్ కమి టీ చైర్మన్ యం.సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఈనూతన విద్యా సంవత్స రం లో విద్యార్థులకు సెమిస్టర్ 2 పా ర్య పుస్తకాలను వెంటనే పంపిణీ చే యడం అభినంద నీయమన్నారు.ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు. ఏ.నీలిమ. టి.కుమారీ.పేరెంట్స్ కమిటీ సభ్యులు తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యకలాపాలను రాజకీయ దృక్కోణంలో చూడొద్దు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రభుత్వ కార్యకలాపాలను రాజకీయ దృక్కోణంలో చూసి వార్తలు రాయడం సరికాదని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నరసరావు పేటలో శనివారం నిర్వహించిన 'వార్తాలాప్'ప్రభుత్వ పథకాలపై మీడియా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాస్తవిక దృక్పథంత కూడిన వార్తలు రాయడం అవసరమని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును పరిశీలనాత్మకంగా రాయడంద్వారా సరైన విధంగా, అవి పేదలకు అందేలా సహకరించాలని సూచించారు. వ్యాపార ప్రయోజనాలకోసం కొన్ని పత్రికలు పనిచేయడం ద్వారా పత్రికలు ఎలా పనిచేయకూడదో అనేందుకు మన రాష్ట్రం ఉదాహరణగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని అవసరమైన సందర్భంలో సరైన రీతిలో ప్రశ్నించడంలో ఎవ్వరూ తప్పు పట్టలేరని అన్నారు. నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి డా. జి.అనిత మాట్లాడుతూ లెక్కకు మించిన ప్రచారసాధనాలు, సోషల్ మీడియా చేరవేస్తున్న సమాచారాన్ని ప్రజలు నమ్మడంలేదని ఆమె పేర్కొన్నారు. తమకు అందిన సమాచారం సరైనదా కాదా అని సరిచూసుకుని మాత్రమే వార్తలు రాయాలని సూచించారు. సభకు పి.ఐ.బి. జాయింట్ డైరక్టర్ జి.డిహల్లికేరి అధ్యక్షత వహించారు . పి.ఐ.బి, జె.డి. పి. రత్నాకర్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి. హెన్రీరాజ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వైద్యం వికటించి మహిళ మృతి

మృతదేహంతో దాచేపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు కుటుంబసభ్యుల నిరసన

ప్రజాశక్తి-దాచేపల్లి

ఫ్యామిలీప్లానింగ్ ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందింది. మండలంలోని భట్రుపాలెం గ్రామానికి చెందిన కేలావత్ నందినిబాయ్ (23) దాచేపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌లో గత బుధవారం ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నారు. తొమ్మిది రోజుల తర్వాత ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. నందిని బాయ్ కుటుంబ సభ్యులు ఆమెను గ్రామానికి తీసుకు వెళ్ళారు. అయితే, ఇంటకి చేరుకున్న తర్వాత కొంచెం సేపటికే ఆమె కళ్ళు తిరిగి పడిపోయింది. దీంతో, దాచేపల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పిడుగు రాళ్లకు తీసుకువెళ్లమని నందినిబాయ్ కుటుంబసభ్యులకు వైద్యులు సూచించారు. ప్రైవేట్ అంబులెన్స్ లో పిడుగురాళ్లకు తరలిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి ఆమె మార్గ మధ్యంలో మృతి చెందింది. దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయిందని ఆమె తల్లి దండ్రులు, భర్త రమేశ్ ఆరోపిస్తున్నారు. దాచేపల్లి ప్రభుత్వ వైద్యశాల ముందు నందినిబాయ్ మృతదేహంతో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరసన చేస్తున్న ప్రాంతానికి వెళ్లిన దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టమాటాల కోసం తరలిన జనం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాయితీ టమాటాల కోసం ప్రజలు తరలివచ్చారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజార్లో శనివారం టమాటా పంపిణీ చేశారు. పంపిణీ కేంద్రాన్ని యార్డు చైర్మన్ పెండెం బాబురావు, వైసిపి నేత చల్లంచర్ల సాంబశివరావులు ప్రారంభించారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో టమాట ధరలు అధికంగా ఉండటంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా ప్రభుత్వం రాయితీ పై కేజీ రూ.50 కే టమాటాలు పంపిణి చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టమాటాల కోసం ప్రజలు బారులు తీరారు. సుమారు 1200 కిలోలు టమాటాలు పంపిణి చేసినట్లు యార్డు కార్యదర్శి భాస్కర్ రెడ్డి తెలియజేశారు.

రాయితీ టమాటా పక్కదారి

ప్రజలకు పంపిణీ చేయాల్సిన రాయితీ టమాటా పక్కదారి పడుతున్నాయి. మార్కెట్ యార్డు గోదాములో ఉంచి అక్కడ నుండి టమాటాలు తరలిస్తున్నారు. టమాటాలు వచ్చిన ప్రతి సారి కొన్ని టామాటా బాక్సులు పక్కకు తరలిసున్నారు. ప్రజలకు అరకొరగా పంపిణీ చేస్తున్నారు. టమాటాలు పక్కకు తరలిస్తున్నారని ప్రజలు గోతాలలో వేసుకుని అధికార పార్టీ నాయకులు తీసుకు పోతున్నారని ఆరోపిస్తున్నారు.

బుగ్గ వాగు ఏఈ గా రమణయ్య

ప్రజాశక్తి -రెంటచింతల: మండలంలోని మంచికల్లులో ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్ ఏఈగా రమణయ్య శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వినుకొండ సమీపంలోని వెల్లటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు

నోటీసు

మహారాజశ్రీ బాపట్ల, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఓ.పి నెం.59/2020

(హిందూ వివాహ చట్టం,1955 సంబంధించి)

పుట్లూరి నాగేశ్వరరావు ....పిటిషనరు

ఎదిరి

పుట్లూరి శివరాణి అలియాస్
ఆదిపూడి శివారాణి అలియాస్ శివ.... రెస్పాండెంట్లు

శ్రీమతి పుట్లూరి శివరాణి అలియాస్
ఆదిపూడి శివారాణి అలియాస్ శివ
భర్త పుట్లూరి నాగేశ్వర రావు
కట్టెంపూడి క్రాస్ రోడ్డు, కట్టెంపూడి పంచాయితి,
పొన్నూరు మండలము, గుంటూరు జిల్లా.

పై నంబరు కేసులోని పిటిషనరు అయిన పుట్లూరి నాగేశ్వర రావు పై నంబరు కేసులో రెస్పాండెంటు అయిన పుట్లూరి శివరాణి అలియాస్ ఆదిపూడి శివరాణి అలియాస్ శివ అను మీపై పై నంబరు పిటీషనును మీరు తనపై క్రూరత్వం కలిగి ఉన్నారనే అంశం పై మీతో తనకు గల వివాహ రద్దుకు హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 13(1)(a) క్రింద దాఖలు చేసియున్నారు. ది.07-08-2023 పై నంబరు కోర్టులో మీ హాజరు నిమిత్తం పై నంబరు పిటిషను వాయిదా వేయబడియున్నది. కావున మీరు ది.07-08-2023 న ఉదయం 10:30 గం : లకు పై తెల్పిన కోర్టులో మీరు నేరుగా కానీ,మీ తరపున మీ న్యాయవాది ద్వారా గాని మీ వాదనకు కావలసిన డాక్యుమెంట్లు తో హాజరు కాబడవలసి యున్నది. మీరు సమాధానము కూడా దాఖలు చేయవలెనని ఇందు వెంట కోరబడుచున్నది.ఒక వేళ మీరు పై తెల్పిన తేదీ ,పై తెల్పిన సమయములో హాజరు కాని పక్షంలో పై తెల్పిన కేసు మీ పరోక్షంలో పిటిషనరును కోర్టు వారు విని, నిర్ణయించి పై నంబరు పిటిషన్ ను పరిష్కరించ బడునని ఈ నోటీసును పత్రిక ప్రకటన ద్వారా మీకు తెల్పడమైనది.

* వాయిదా తేది మరియు హాజరు కాబడవలసిన తేది:07-08-2023 ఉదయం :10.30 గం:లకు

రామ ప్రభుమాడభూషి,
అడ్వకేటు,పొన్నూరు
సెల్ నెం.9849843562.

అప్పాపురం ఛానల్ ఆధునీకరణ

- రూ.41 లక్షలతో మూడు ప్యాకేజీలుగా విభజించి పనులు పూర్తి
- అధికారుల చొరవతో 25 వేల ఎకరాలకు ప్రయోజనం

ప్రజాశక్తి-తెనాలి

దీర్ఘకాలికంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ఇరిగేషన్ అధికారులు పరిష్కరించారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని సాగునీటి కాలువలను ఆధునీకరించి, రైతులకు ఖరీఫ్‌లో ఊరటనిచ్చారు. దాదాపు 25 వేల ఎకరాల ఆయకట్టుకు మేలు చేసే అప్పాపురం ఛానల్ ఆధునీకరణకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగంజాగర్లమూడి నుంచి కాకుమాను వరకూ అప్పాపురం ఛానల్ విస్తరించి ఉంది. దాదాపు దీని ప్రయాణం 43 కిలోమీటర్లు, ఈ ఛానల్ పరిధిలో 25వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. అయితే ఎంతో కాలంగా ఈ చానల్ అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. ఆధునీకరణకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనిచేయకపోవటం, దానిపై అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి రైతులకు ఎన్నో సమస్యలు తెచ్చిపెట్టింది. ఇటీవల కాలంలో పత్తిపాడు నియోజకవర్గ పరిధిలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి పర్యటించిన సందర్భంగా అప్పాపురం ఛానల్ ఆధునీకరణను పట్టించుకోవటంలేదంటూ రైతులు పిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణా వెస్ట్రన్ డెల్టా కార్యనిర్వాహక ఇంజనీర్ ఎస్.మల్లిఖార్జున ఏఎం ఛానల్ ఆధునీకఅకు ఆఘమేగాల మీద చర్యలు తీసుకున్నారు. గతంలో పనిచేయని కాంట్రాక్టర్‌ను పక్కనబెట్టి, మరొకరికి పనులు అప్పగించారు. రూ.41లక్షల అంచనాతో ప్రత్యామ్నాయాన్ని ఆలోచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు మూడు ప్యాకేజీలుగా విభజించారు. 0-16 కిమీ వరకూ రూ.18.02లక్షలు, 16-30 కిమీ వరకూ రూ.13,88లక్షలు, 30-43 కిమీ వరకూ రూ.9లక్షలు కేటాయించారు. ఛానల్‌లో ఎప్పటినుంచో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించారు. దీంతో ఎప్పటినుంచో పేరుకుపోయిన సమస్యకు పరిష్కారం అభించినట్లైంది. మరమ్మతులు ఖరీఫ్ సీజన్‌లో పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందుబాటులోకి తేవటంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ర్యాలీలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సయ్యద్ కాలేదా నశీం

డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘం, పట్టణ మలేరియా, ఫైలేరియా యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో డెంగ్యూ వ్యాధి పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో డెంగ్యూ వ్యాధిపై ప్రదర్శన ఏర్పాటు చేశారు. దోమ లార్వా, లార్వాలను తినే గాంబూసియా చేపలను , దోమలకు ఆవాసాలైన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ బాటిల్స్, గాజు సీసాలు, టైర్లు, రుబ్బురోలు వం టివి ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా యన్.సి.ఆర్.యం. మునిసిపల్ హైస్కూల్ యన్.సి.సి ఆఫీసర్ స్వామి, యన్.సి.సి. ఆర్మీ వింగ్ ఆఫీసర్ పులి భాస్కరరావు ఆధ్వర్యంలో యన్.సి.సి విద్యార్థులతో భారీ అవ గాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెచ్ నిర్మల, ఇన్చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వి.పున్నారెడ్డి, పట్టణ మలేరియా సబ్ యూని ఆఫీసర్ ఎస్.ఉమాకాంత్, మలేరియా పర్యవేక్షకులు డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సహించేది లేదు

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

చంద్రబాబు నాయుడు, లోకేష్ , నందమూరి బాలకష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని టిడిప రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డిలో అసంతప్తి, అసహనం ఓడిపోతామనే భయం పెరిగిపోయి చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. పాలన గురించి చెప్పుకోవడానికి ఏమీ లేక జగన్‌రెడ్డి మాట్లాడే తీరు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ప్రజల కోసం పోరాడుతున్న చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తరిమికొడతారని మోహనకృష్ణ హెచ్చరించారు.

సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ దినదినాభివృద్ధి

ప్రజాశక్తి-తెనాలి

ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ, వారి నమ్మకంతో సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ దినదినాభివృద్ధి చెందుతోందని చైర్మన్ పిఆర్‌విపిఎస్ రాజు అన్నారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో శనివారం సొసైటీ తెనాలి శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌సస, రిటైర్డ్ ఉద్యోగులకు బ్యాంకింగ్ తరహా సేవలందించాలన్న లక్ష్యంతో ఇరు తెలుగు రాష్ట్రాల్లో సొసైటీ ఆవిర్భవించిందన్నారు. ఇప్పటికి 90వేల మంది ఖాతాదారులతో మూడు వేల కోట్లు టర్నోవర్‌తో సొసైటీ విజయపథంలో దూసుకు పోతోందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భవిష్యత్‌లో ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. సమావేవంలో సొసైటీ రిలేషన్ షిప్ మేనేజర్ డివిఎస్ శంకరరావు, ఖాతాదారులు పాల్గొన్నారు. తొలుత సొసైటీ వ్యవస్థాపకులు వాసిరెడ్డి హనుమంతరావు చిత్రపటానికి అతిధులు నివాళులర్పించారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కేసుల సత్వర పరిష్కారనికి లోక్ అదాలత్ చక్కటి వేదికని పదకొండో అదనపు జిల్లా న్యాయమూర్తి, తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ జి.మాలతి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికారసంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సంయుక్త సూచనలు మేరకు శనివారం మోటార్ వాహనాల ప్రమాదాలు, భూమి సంబంధిత పిటిషన్ల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో 5 మోటార్ వాహన ప్రమాద పిటిషన్లు రాజీ కుదిరినట్లు తెలిపారు. భాదితులకు రూ 31 లక్ష 65 వేలు పరిహారం అందిందన్నారు.

లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్, ఎమ్మెల్యే తదితరులు

కొనసాగుతున్న సురక్ష క్యాంప్‌లు

ప్రజాశక్తి-గుంటూరు

శారదా కాలనీ, హనుమయ్యనగర్, కృష్ణనగర్, యల్‌ఆర్ కాలనీల్లో సురక్ష క్యాంప్‌లు జరిగాయి. ఈ క్యాంపుల్లో వివిధ సేవలకు సంబంధించి 3633 దరఖాస్తులు పరిశీలించి, నిర్దేశిత పత్రాలు ఉన్న వారికి సర్టిఫికెట్లు అందచేశారు.శారదా కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందలేదని ఏ ఒక్కరు బాధ పడకూడదనే లక్ష్యంతో సంక్షేమ పాలనకు జగన్మోహనరెడ్డి ప్రభుత్వం నాంది పలికిందని, పాదయాత్రలో గమనించిన ప్రజా సమస్యలే అజెండాగా పాలన సాగిస్తున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముస్తఫా, డిప్యూటీ మేయర్ మాట్లాడారు. వివిధ అంశాల్లో దరఖాస్తు చేసుకున్న వారికీ ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, డిప్యూటి కమిషనర్ రవీంద్ర, వైసిపి నాయకులు షేక్ నూరి ఫాతిమా, నోడల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 12,13 సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడారు. అనంతరం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ వి ఎం లక్ష్మీపతి రావు, రెవెన్యూ అధికారి ఎం బాబురావు, జే సి ఎస్ పట్టణ కన్వీనర్ ఎండి పురోజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

ప్రతి కుటుంబం ఆర్థిక అభివద్ధిలో ప్రగతి సాధించాలనేదే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హనీ క్రిష్టినా నా అన్నారు. మండలంలోని డోకిపర్రు గ్రామ సచివాలయం వద్ద శనివారము జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ లు పాల్గొన్నారు. గ్రామములో జిల్లా పరిషత్ నిధులు రూ. 20 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ హెని క్రిష్టిన మాట్లాడుతూ ఏ ఒక్కరికి సంక్షేమం దూరం కాకూడదని, అందని వారికి కూడా జగనన్న సురక్ష ద్వారా వెతికి సంక్షేమం అందించారని అన్నారు. ఈ సందర్భంగా అర్హులైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న ,జడ్పిటిసి కందుల సిద్దయ్య, గ్రామ సర్పంచ్ కొండూరు సామ్రాజ్యం , ఎంపీడీవో కే ప్రభాకర్ రావు , తహశీల్దార్ శ్రీనివాస శర్మ పలువురు నాయకులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెనీ క్రిస్టినా, కత్తెర సురేష్‌కుమార్ తదితరులు

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఇఒ

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని దండమూడిలో ఎంపీయుపి పాఠశాలలో శనివారం ఎంఈఓ2 శ్రీనివాస్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.విద్యార్థులతో కలిసి భోజనం తిని హర్షం వ్యక్తం చేశారు.పాఠశాల రికార్డులను విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేసి విద్యార్థులకు లెక్కలు బోధించారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు.పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని హెచ్ఎం నయీమ్ బాషాకు సూచించారు

ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ఆరో వార్డులో తాగునీరు లిప్టు చేసే మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గత నాలుగు రోజుల నుంచి తాగునీటి సరఫరా ఇబ్బందిగా మారింది. టిడిపి నాయకులు జలధార పేరుతో ఆ ప్రాంతానికి తాగునీటిని వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేశారు.

విద్యుత్ శాఖ అధికారుల ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-తాడేపల్లి

గత నాలుగు రోజులుగా తాడేపల్లి పట్టణంలో నానుడు వర్షం కురుస్తుండటంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎఇలు ఎన్.నాగమల్లేశ్వరరావు, వి.షణ్ముఖరావు పట్టణంలో ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చెట్లను, కొమ్మలను తొలగించారు. ముందుగానే విద్యుత్ సక్రమంగా సరఫరా కావడానికి చర్యలు తీసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బందికి ప్రజలు అభినందనలు తెలిపారు.

మెల్లెంపూడి మసీదు నిర్మాణానికి లక్ష సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని మెల్లంపూడిలో మసీదు నిర్మాణానికి తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని తెలుగుదేశం నాయకులు ద్వారా ముస్లిం పెద్దలకు శనివారం అంద జేశారు. అడిగిన వెంటనే మసీదు నిర్మాణానికి లక్ష రూపా యలు సహాయం చేసిన నారా లోకేష్ కు మెల్లెంపూడి ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నందం అబద్దయ్య, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ కాసింఖాన్, టిడిపి గ్రామ అధ్యక్షులు షేక్ నాగుల్, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఖాసీం బాబు, సొంటి కళ్యాణి, షేక్ సబిహా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేయ డమే లక్ష్యమని అసి స్టెంట్, డిప్యూటీ కమిషన్లు శ్రీనివాసరావు, శివారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎనిమిదో సచివాలయంలో శని వారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైసిపి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ ఇ.డేవిడ్‌రాజు, ఎంటిఎంసి వైసిపి కన్వీనర్ డి.వేమారెడ్డి, జి.పెదగాలయ్య, డి.అనిల్ పాల్గొన్నారు..

విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థినికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

నాగమణిని అభినందిస్తున్న శ్రీకృష్ణదేవరాయలు

వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలోని అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం విద్యార్థిని సంగుల నాగమణికి శనివారం విజ్ఞాన్స్ యూనివ ర్సటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. నాగమణి 'మల్టిఫంక్షనల్ అట్రిబ్యూట్స్ ఆఫ్ రేర్-ఎర్త్ సింగల్ అండ్ డబుల్ డోప్డ్‌లెడ్ ఫ్రీ స్ట్రాన్షియం బిస్మత్ నియోబేట్ సిరామిక్ మెటీరియల్స్' అనే అంశంపై పరిశోధన చేసిందన్నారు. ఈమెకు విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ జాలాది నిశ్చల్ కిరణ్, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి ప్రొఫెసర్ భీమవరపు శివ బసివిరెడ్డి సంయుక్త గైడ్‌లుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగమణిని విజ్ఞాన్స్ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ నాగభూషణ్ తదితరులు అభినందించారు.

విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు అందచేస్తున్న స్కూల్ డైరెక్టర్లు, అసోసియేసన్ ప్రతినిధులు

ఎసిఎంఇ స్కూల్లో జిల్లా ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు శనివారం పొత్తూరులోని ఎసిఎంఇ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీలను స్కూల్ డైరెక్టర్లు సౌగంధ్ కృష్ణ, దీప్తి నందమూరి ప్రారంభించగా, గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్.క్రిస్టోఫర్, సెక్రెటరీ డి.అశోక్, ప్రెసిడెంట్ కనమర్లపూడి సత్యనారాయణ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 8, 10, 12 సంవత్సరాల విద్యార్థులు, సుమారు వంద మంది ఈ పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు స్కూల్ డైరెక్టర్లు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. ఈ పోటీలకు కె.సంగీతబాబు, మీరావలి, అర్జున్‌రావు, రుకేష్, రవి రాజాబాబు, వంశీ, ఆర్య, ఇజ్రాయేలు, ఎన్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు అందచేస్తున్న డిఇఒ, ఇతర అధికారులు

సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాల పంపిణీ జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, ముందస్తుగా సెమిస్టర్ 2 పుస్తకాలను శనివారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పంపిణీ చేశారని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఏ విధమైన అసౌకర్యం కలిగించకుండా, ప్రభుత్వమే నేరుగా పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు చేర్చిందన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేనాటికే విద్యార్థులకు జెవికె కిట్లతోపాటు, సెమిస్టర్-1 పాఠ్యపుస్తకాలు కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాట వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి ఖాసీం, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ హైస్కూల్లో..

స్థానిక హిందూ కాలేజి హైస్కూల్లో శనివారం సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి హాజరై విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందచేశారు. కార్యక్రమంలో హైస్కూల్ పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు గబ్బిట శివరామ కష్ణప్రసాద్, కెఎస్ఆర్ కుటుంబరావు, హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ప్రక్షాళన జరిగేనా?

వీక్షణం

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన చికిత్సలు అందించడానికి నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్ గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు సంతోషంగా ఇంటికి వెళ్లేలా కృషి చేస్తామని డాక్టర్ కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన తొలి రోజుల్లోనే ప్రకటించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆయన సూపరింటెండెంట్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. అయితే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిని ప్రక్షాళన చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని అని అనేక మంది చేయితిరిగిన వైద్యులు చెబుతుంటారు. దిగువస్థాయి సిబ్బంది సరిగా పనిచేయక పోవడం వల్ల ఆస్పత్రిలో వైద్యులు ఎంత కష్టపడ్డా మంచి పేరు రావడం లేదని సీనియర్ వైద్యులు వాపోతున్నారు. అంతేగాక జిజిహెచ్‌లో పనిచేసే వైద్యుల్లో చాలా మందికి సొంత ప్రైవేటు వైద్యశాలలు ఉన్నాయి. దీంతో కొంత మంది ఇక్కడ మొక్కుబడిగా ఉద్యోగాలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకు పనిచేసిన సూపరింటెండెం ట్ల కన్నా కిరణ్‌కుమార్ ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లోను పరిశీలన చేస్తున్నారు. ప్రధానంగా అత్యవసర విభాగంలో నెలకొన్న నిర్లక్ష్యంను తగ్గించేందుకు చాలావరకు మార్పులు చేస్తున్నారు. అత్యవసర విభాగంలో తన చాంబర్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. సాధారణ సర్జరీలు వెంటనే పూర్తి చేసేలా, పరీక్షల నివేదికలు వెంటనే వచ్చేలా చర్యలు చేపట్టారు. ఆస్పత్రిలోని కొన్ని విభాగాల్లో వైద్యుల్లోనూ తీవ్ర నిర్లక్ష్యం కన్పిస్తుంది. కొన్ని విభాగాల్లో మాత్రం అద్భుతాలు చేస్తున్నారు. ఇటీవల ఒక విభాగంలో రూ.2 లక్షలు వేతనం తీసుకునే అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేయాల్సిన శస్త్ర చికిత్సలను కాంట్రాక్టు వైద్యులతో చేయించడాన్ని డాక్టర్ కిరణ్‌కుమార్ గమనించారు. దీనిని ఆయన తీవ్రంగా పరిగణించారు. శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వైద్యులపై మండిపడ్డారు. ఒక వైపు రోగులకు మెరుగైన చికిత్సలతో పాటు వివిధ విభాగాల్లో పరిపాలనపరమైన మార్పులకు కూడా శ్రీకారం చుట్టారు. వైద్యులకు సరైన ఆహారం అందించిన డైట్ కాంట్రాక్టరుపై కూడా సీరియస్ అయ్యారు. రోగుల సంరక్షణ, అత్యవసర కేసులు, సత్వర వైద్యం అందించడానికి ఆయన అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వివిధ విభాగాల మధ్య సమన్వయం పెంచుతున్నారు. క్షేత్రస్థాయిలో రోగులు, వారి సహాయకులకు నాల్గో తరగతి ఉద్యోగుల నుంచి సరైన సహాయం అందడం లేదు. ప్రధానంగా రోగులను స్ట్రక్చరుపై వార్డులోకి తీసుకువెళ్లడానికి వార్డు బాయ్స్ రావడంలేదు. రోగుల సహాయకులే మోసుకుని వెళ్లాల్సి వస్తుంది. ఇందు వల్ల ఒక్కో రోగికి ఇద్దరు ముగ్గురు సహాయకులు ఆస్పత్రికి రావాల్సి వస్తుంది. ఇందువల్ల ఆస్పత్రిలో అనవసరపు రద్దీ పెరుగుతోంది. రక్త పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, ఇతర సేవలన్నీ వేర్వేరుచోట ఉండటం వల్ల రోగిని స్ట్రక్చర్‌పై మోసుకు వెళ్లేందుకు ఇద్దరు, వారికి సహాయంగా మరొకరు తప్పనిసరిగా ఉండాల్సి వస్తుంది. పలు వార్డుల్లో మంచాల సంఖ్య పెరగాల్సి ఉంది. స్ట్రక్చర్‌పై చికిత్సలు చేసేపరిస్థితిని తొలగించడం, అత్యవసర విభాగం నుంచి వీలైనంత త్వరగా రోగులను వార్డులకు తరలించేందుకు డాక్టర్ కిరణ్‌కుమార్ చేపట్టిన ప్రణాళిక కొంతమేరకు సత్ఫలితాలు ఇస్తుంది. అలాగే అంబులెన్స్ నిర్వహణపై నియంత్రణ ఉండటంలేదు.

(ఎ.వి.డి.శర్మ)

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

నిరసనలో మాట్లాడుతున్న నళినీకాంత్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ అదనపు భారాలతో ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయని సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్ అన్నారు. నగరంలోని పాత గుంటూరు శ్రామిక నగర్‌లో శనివారం సిపిఎం బృంద సభ్యులు స్థానిక ప్రజలతో కలిసి విద్యుత్ బిల్లు భారాలపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం అడ్డగోలుగా అధిక ధరలకు ప్రైవేటు సంస్థల నుండి అధిక ధరకు విద్యుత్‌ను, బొగ్గును కొనటం వల్ల పెరిగిన భారాలను ప్రజలపై మోపుతుందని విమర్శించారు. ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు, తదితర అదనపు భారాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు అందుబాటులో లేక ప్రజలు అల్లాడుతున్నారని, ఈస్థితిలో ప్రభుత్వం విద్యుత్ అదనపు ఛార్జీల పేరుతో భారం మోపటం దుర్మార్గం అన్నారు. అప్పుల కోసం కేంద్రం చెప్పిన విద్యుత్ సంస్కరణలు అమలు చేయటం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదిస్తున్న ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు లక్కా అరుణకుమారి, తాడిబోయిన శ్రీనివాసరావు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో కెఎల్‌యు విద్యార్థి ప్రతిభ

కాంస్య పతకం సాధించిన మద్దినేని ఉమా మహేష్‌కు వర్సిటీలో ఘన సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఉమామహేష్ ను సత్కరిస్తున్న విసి ఎవిఎస్.ప్రసాద్ తదితరులు

ఉత్తర కొరియా చాంగ్‌వాన్‌లో జరిగిన జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తృతీయస్థానంలో కాంస్య పతకం సాధించిన కెఎల్ డీమ్డ్ వర్సిటీ సిఎస్ ఐటి విద్యార్థి మద్దినేని ఉమా మహేష్‌ను ఘనంగా సన్మానించారు. శనివారం వర్సిటీ చేరుకున్న మహేష్‌ను భారీ ఊరేగింపుతో వైస్ ఛాన్సలర్ ఛాంబర్ వరకు విద్యార్థులు తీసుకువచ్చారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ జి పార్థసారధివర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ మహేష్‌ను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, ప్రథమ ఇంజనీరింగ్ విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎ జగదీష్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె హరికిషోర్ ఉమా మహేష్‌ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ మాట్లాడారు. వరల్డ్ జూనియర్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. మొత్తం 46 దేశాలు పోటీ పడ్డాయని, తమ వర్సిటీ విద్యార్థి పతకం సాధించి ఉత్తరకొరియాలో భారత జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయడానికి శాయశక్తులా కృషి చేశాడని కొనియడారు. జర్మనిలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్ పోటీల్లో ఉమామహేష్ బంగారు పతకం సాధించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏడాది క్రీడలకు పెద్ద పీట వేయడం వలనే క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధిస్తున్నారని తెలిపారు. ఒలంపిక్ వంటి అంతర్జాతీయ క్రీడల్లో సైతం తమ విద్యార్థులు మువ్వన్నెల జెండాను ఎగురవేసి దేశ కీర్తి ప్రతిష్టలు దింగతాలకు చాటుతున్నారని అభినందించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బా రావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కెఎల్ యూనివర్సిటీ ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తమ వర్శిటీలో చదువుతున్న క్రీడాకారుల కోసం రూ. కోటి ప్రత్యేక నిధిని కేటాయించినట్లు తెలిపారు. చదువుతో పాటు క్రీడలు కూడా జీవితంలో ముఖ్యమని అన్నారు. క్రీడల వలన మానసికోల్లాసంతో పాటు పోటీని ఎదుర్కోవడం, ఓటమిని అంగీకరించి మళ్లీ గెలవడానికి చేసే ప్రయత్నాలు మనిషి ఉన్నతికి తోడ్పడతాయని అన్నారు. విద్యార్థి ఉమా మహేష్ మాట్లాడుతూ తాను కాంస్య పతకం సాధించడంలో తల్లిదండ్రులు, కె ఎల్ యూనివర్శిటీ అధ్యాపకులు, కోచ్ అందించిన ప్రోత్సాహమే కారణమని తెలిపారు.